# చిన్న పరిశ్రమలకు చేయూత




- బయ్యర్లు, పారిశ్రామిక వేత్తలకు వారధిగా నిలుస్తున్న టీఎస్ఎంఎస్ఈఎఫ్‌సీ
- ఏడు జిల్లాలతో కలిసి రంగారెడ్డి రీజియన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఇప్పటివరకు కౌన్సిల్ ద్వారా 753 కేసుల పరిష్కారం
- పరిశ్రమలకు రూ.474.51కోట్లు చెల్లించిన బకాయిదారులు
- కేసుల పరిష్కారంలో జాతీయ స్థాయిలో ఆరో స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా కౌన్సిల్

రంగారెడ్డి, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ ఫెసిలిటేషన్ కౌన్సిల్ (టీఎస్ఎంఎస్ఈఎఫ్‌సీ) సత్ఫలితాలను ఇస్తున్నది. బయ్యర్ల నుంచి రావాల్సిన మొండి బకాయిలను పారిశ్రామికవేత్తలకు ఇప్పించి చిన్న పరిశ్రమలకు చేయూతనందిస్తున్నది. సమస్య కోర్టు వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే సామరస్య పూర్వకంగా 90 రోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తున్నది. అనతికాలంలోనే అత్యధిక కేసులను పరిష్కరించిన రంగారెడ్డి ఫెసిలిటేషన్ కౌన్సిల్ జాతీయ స్థాయిలో ఆరో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు ఈ కౌన్సిల్ 753 కేసులను పరిష్కరించి రూ.474.51కోట్లను బయ్యర్లు పరిశ్రమలకు చెల్లించేలా చర్యలు తీసుకున్నది.

### రాష్ట్రంలో ఆరు కౌన్సిళ్ల ఏర్పాటు

ఉత్పత్తులకు సంబంధించిన చెల్లింపులను బయ్యర్లు చెల్లించకపోవడంతో చిన్న పరిశ్రమలు నష్టాలను చవిచూడాల్సి వస్తున్నది. మొండి బకాయిలతో పరిశ్రమలను నడపలేక మూతపడే స్థితికి చేరుకుంటున్నాయి. ఈ పరిస్థితుల నుంచి చిన్న పరిశ్రమలను గట్టెక్కించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2018 సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో టీఎస్ఎంఎస్ఈఎఫ్‌సీని ఏర్పాటు చేసింది. తెలంగాణకు ముందు ఒకే ఒక్క కౌన్సిల్ ఉండగా.. పెరిగిన సమస్యల దృష్ట్యా బీఆర్ఎస్ ప్రభుత్వం కౌన్సిళ్లను విస్తరించడం చిన్న పరిశ్రమలకు మరింత మేలు చేకూర్చింది. ప్రతి కౌన్సిల్‌కు పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి స్థాయి అధికారిని చైర్మన్‌గా నియమించి జ్యుడీషియల్ పవర్స్‌ను కల్పించింది. పరిశ్రమల నుంచి వచ్చే దరఖాస్తులను ఈ కౌన్సిళ్లు గరిష్ఠంగా 90 రోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తున్నాయి. ఒకవేళ కౌన్సిల్ ఇచ్చిన తీర్పుపై బయ్యర్లు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే... కౌన్సిల్ ఇచ్చిన తీర్పు ప్రకారం చెల్లించాల్సిన మొత్తంలో 75 శాతం కోర్టులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

### పారిశ్రామిక రంగంలో అద్భుతాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీఎస్ ఐపాస్ రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అద్భుతాలను సృష్టిస్తున్నది. అన్నీ సజావుగా ఉంటే 15 రోజుల్లోనే అనుమతులొచ్చేస్తున్నాయి. రవాణా సదుపాయాలు మెరుగుపడడం.. శాంతి భద్రతల సమస్యలు లేకపోవడంతో పారిశ్రామికవేత్తలు గ్రామీణ జిల్లాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా.. ఒకప్పుడు అన్ని రంగాల్లో వెనుకబడిన రంగారెడ్డి జిల్లాలో పారిశ్రామిక ప్రభ నేడు వెలిగిపోతున్నది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఎన్నింటికో జిల్లా ఆకర్షణీయ గమ్యస్థానమైంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు జిల్లాలో కేవలం రూ.3,328 కోట్ల పెట్టుబడులతో 2,777 పరిశ్రమలు మాత్రమే ఏర్పాటయ్యాయి. అప్పట్లో కేవలం 45,763 మందికి మాత్రమే ఉపాధి కల్పించారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలిరావడంతో ప్రస్తుతం జిల్లాలో రూ.47 వేల 62 కోట్ల పెట్టుబడులతో 1,252 పరిశ్రమల ఏర్పాటు ద్వారా 5,15,851 మందికి ఉపాధి కల్పిస్తున్నది. ఫాక్స్ కాన్ తదితర పెద్ద పెద్ద కంపెనీలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణకు తరలివచ్చాయి.

### చిన్న పరిశ్రమలకు ఎంతో మేలు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కౌన్సిల్‌తో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ఎంతో మేలు కలుగుతున్నది. రంగారెడ్డి రీజియన్ పరిధిలో అత్యధిక సమావేశాలను నిర్వహించి బయ్యర్లు, పరిశ్రమల నిర్వాహకుల మధ్య రాజీ కుదిర్చి అత్యధిక దరఖాస్తులను పరిష్కరించాం. గతేడాది జాతీయ స్థాయిలో అవార్డును సాధించడంతోపాటు, ప్రస్తుతం జాతీయ స్థాయిలో కేసుల పరిష్కారంలో 6వ స్థానంలో ఉన్నాం. ఇది కౌన్సిల్‌లోని అందరి సభ్యుల సమష్టి విజయం.

- రాజేశ్వర్ రెడ్డి, చైర్మన్, ఫెసిలిటేషన్ కౌన్సిల్, రంగారెడ్డి రీజియన్

### ముందంజలో రంగారెడ్డి రీజియన్ కౌన్సిల్

టీఎస్ఎంఎస్ఈఎఫ్‌సీ రంగారెడ్డి రీజియన్ కౌన్సిల్ కేసుల పరిష్కారంలో ముందంజలో ఉంటూ వస్తున్నది. రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలతో కలిపి గత ప్రభుత్వం రంగారెడ్డి రీజియన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. గడిచిన ఐదేండ్ల కాలంలో ఈ రీజియన్‌కు బకాయిల విషయమై పరిశ్రమల నుంచి 1,960 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు కౌన్సిల్ బయ్యర్ల నుంచి రావాల్సిన మొండి బకాయిలను సత్వరమే ఇప్పించేందుకు 92 సమావేశాలను నిర్వహించింది. వివిధ కారణాలతో 700 దరఖాస్తులను కౌన్సిల్ తిరస్కరించింది. మరో 753 దరఖాస్తులను పరిష్కరించి రూ.474.51కోట్ల బకాయిలను సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల నిర్వాహకులకు చెల్లించేలా ప్రత్యేక చొరవ చూపింది. కేసుల సత్వర పరిష్కారానికి కౌన్సిల్ చేపట్టిన చర్యలు చిన్న పరిశ్రమలకు గొప్ప ఊరటనిచ్చాయి. రంగారెడ్డి రీజియన్ కౌన్సిల్ 2021-22 ఏడాదికి ఔట్ పెర్ఫార్మింగ్ విభాగంలో జాతీయస్థాయిలో అవార్డును పొందింది. 74.13 శాతం దరఖాస్తుల పరిష్కారంతో ప్రస్తుతం రంగారెడ్డి రీజియన్ కౌన్సిల్ జాతీయస్థాయిలో ఆరో స్థానంలో నిలిచింది.

# ఆటా సేవలు అభినందనీయం



ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, మైక్‌సెట్లు, డ్రమ్ములు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఆటా ప్రతినిధులు

కడ్తాల్, డిసెంబర్ 29 : అమెరికా తెలుగు సంఘం (ఆటా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆటా వేడుకలు-2023లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటా సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, కేజీబీవీ పాఠశాలలకు రూ.లక్ష విలువ చేసే మైక్ సెట్లు, స్కూల్ బ్యాగ్స్, బ్యాండ్ సెట్లు, అలాగే హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు రూ.లక్ష విలువ చేసే బారికేడ్లను పోలీస్ స్టేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెండేండ్లకోసారి ఆటా ప్రతినిధులు వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కడ్తాల్ గ్రామంలో సేవా కార్యక్రమాలను చేపడుతున్న ఎన్ఆర్ఐ గూడూరు కిశోర్‌రెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆటా మాజీ అధ్యక్షుడు భీంరెడ్డి పరమేశ్, కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కోశాధికారి సతీశ్‌రెడ్డి, నేషనల్ కోఆర్డినేటర్ సూదిని సాయి, ట్రస్టీలు కిశోర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సభ్యుడు బండ ఈశ్వర్, మిమిక్రీ రమేశ్, సీఐ శివప్రసాద్, ఎస్సై హరిశంకర్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఎంఈవో సర్దార్‌నాయక్, హెచ్‌ఎంలు జంగయ్య, యాదయ్య, సుశీల, అనురాధ, నాయకులు శ్రీనివాస్ గౌడ్, భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, వేణుగోపాల్, హన్మానాయక్, చందోజీ, నర్సింహ, బిచ్చానాయక్, జహంగీర్‌అలీ, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ, భిక్షపతి, మల్లయ్య, లక్ష్మయ్య, శ్రీను, నరేశ్‌నాయక్, రాజేశ్, ఇమ్రాన్, రవి మహేశ్ పాల్గొన్నారు.

# పరిశీలిస్తూ.. వివరాలు తెలుసుకుంటూ..



మాదారంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ డైరెక్టర్ శృతి ఓజా

పరిగి, డిసెంబర్ 29 : మండలంలోని మాదారం గ్రామంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ డైరెక్టర్ శృతి ఓజా పరిశీలించారు. శుక్రవారం ఆమె మాదారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తుల స్వీకరణ ఎలా జరుగుతున్నది, దరఖాస్తు ఇచ్చిన వారికి రసీదు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారితో సైతం ఆమె మాట్లాడి ఎలా దరఖాస్తు చేసుకుంటున్నారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దరఖాస్తుల స్వీకరణ చేపట్టాలని ఎంపీడీవోను ఆమె ఆదేశించారు.

# అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి



మారేపల్లితండాలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న మండల ప్రత్యేక అధికారి లలితాకుమారి, తహసీల్దార్ కిషన్

పెద్దేముల్, డిసెంబర్ 29 : ఆరు గ్యారెంటీల పథకాల లబ్ధి కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సంక్షేమ శాఖ జిల్లా అధికారి, మండల ప్రత్యేక అధికారి లలితాకుమారి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కొండాపూర్, జనగాం, దుగ్గాపూర్, మారేపల్లితండా, మదనంతాపూర్, మన్‌సాన్‌పల్లి గ్రామాల్లో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం 6 గ్యారెంటీల అమలు లక్ష్యంగా ప్రవేశపెట్టిన దరఖాస్తులను ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు గ్రామాల్లో నిర్ణయించిన తేదీ, సమయానికి అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో లక్ష్మప్ప, సర్పంచ్ పాండూనాయక్, ఆర్ఐ రాజూరెడ్డి, సీడీపీవో రేణుక, సూపర్‌వైజర్ రాణి, ఏఈ సందీప్, టీఏ విజయ్‌కుమార్, సీసీ అనంతయ్య, ఏవో నజీరొద్దీన్, సీనియర్ అసిస్టెంట్ వేణు, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గడువులోపు ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించాలి



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు వినోద్‌కుమార్ అహిర్వార్, ప్రియారంజన్ శ్రీవాస్తవ, శంకర్‌గుప్తా

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 29 : ఎన్నికల నేపథ్యంలో చేసిన ఖర్చు వివరాలను గడువులోపు సమర్పించాలని జిల్లా వ్యయ పరిశీలకులు వినోద్‌కుమార్ అహిర్వార్, ప్రియారంజన్ శ్రీవాస్తవ, శంకర్‌గుప్తా సూచించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది సెగ్మెంట్ల నుంచి పోటీ చేసిన అభ్యర్థులందరూ ఎన్నికల సందర్భంగా చేసిన ఖర్చు మొత్తాలను సరి చూసుకుని అవసరమైన వివరాలను నిర్ణీత గడువులోపు సమర్పించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు చేసిన ఖర్చుల వివరాలను సరిపోల్చుకునేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశం మందిరలో శుక్రవారం రెకన్సీలేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలు, వ్యత్యాసాలను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చుకు సంబంధించి రోజువారీ ఖాతా రిజిస్టర్, నగదు లావాదేవీల రిజిస్టర్, బ్యాంక్ రిజిస్టర్, షెడ్యూల్‌లో 1 నుంచి 11 వరకు ఎన్నికల ఖర్చుల వివరాలను సరిచూసుకుని సరైన క్రమసంఖ్యతో కూడిన అన్ని బిల్లులు, వోచర్లు, ఒరిజినల్ అఫిడవిట్, స్వీయ ధ్రువీకరణతో కూడిన బ్యాంకు స్టేట్‌మెంట్ తదితర వాటిని ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 30రోజుల లోపు సమర్పించాల్సి ఉంటుందన్నారు. గడువు ముగియనున్న నేపథ్యంలో రికన్సీలేషన్ ఏర్పాటు చేశామన్నారు. బ్యానర్స్, పోస్టర్స్, దినపత్రికలు, టీవీ చానల్‌లో ఇచ్చిన యాడ్స్ వివరాలు, వాటికైనా ఖర్చుల వివరాలు కూడా తెలియజేయాలని సూచించారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు సరైన రీతిలో ఖర్చుల వివరాలను సమర్పించేలా ఏఈవోలు మార్గనిర్దేశం చేస్తున్నారన్నారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలు సకాలంలో, నిర్ణీత పద్ధతిలో సమర్పించాలని.. లేనిపక్షంలో అలాంటి వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు. నిర్ణీత కాల వ్యవధిలోపు స్పందించని వారిపై ఆర్‌పీ చట్టం 1951లోని సెక్షన్ 10ఏ ప్రకారం అనర్హత విధించాలని కోరుతూ.. ఎలక్షన్ కమిషన్‌కు లేఖ పంపిస్తామని స్పష్టం చేశారు. ఈసీ ద్వారా అనర్హులుగా ప్రకటించిన వారు, మూడేండ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కోల్పోతారని అన్నారు. సమావేశంలో ఎన్నికల వ్యయ కమిటీ జిల్లా నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, దాత్రిదేవి, ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు, ఏఈవోలు పాల్గొన్నారు.